క్లుప్తంగా

నేడు ప్రజా దర్బార్

చిన్నమండెం : మండల కేంద్రంలో నేడు ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువజన, క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు ప్రజా సమస్యలను మంత్రికి తెలియజేయవచ్చని చెప్పారు.

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

రాయచోటి అర్బన్ : ఈనెల 20న (శుక్రవారం) సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పోతగాళ్ల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. సభలో పార్టీ రాష్ట్రనేతలు, వామపక్ష పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, పలు సంఘాల నేతలు హాజరుకానున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు హాజరై సంతాప సభను విజయవంతం చేయాలంటూ కోరారు.

వ్యాపారాలకు అప్పు ఇచ్చి మోసపోవద్దు


ఎస్‌ఐ ఎం.శ్రీనివాసులు

సుండుపల్లె : మండల పరిధిలోని గొర్రెలు, పొట్టేళ్ల పెంపకందారులు వ్యాపారస్తులకు అప్పు ఇచ్చి మోసపోవద్దని ఎస్‌ఐ ఎం.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టేళ్లు, గొర్రెల పెంపకందారులు తమ గొర్రెలను, పొట్టేళ్లను వ్యాపారస్తులకు అమ్మేటప్పుడు వ్యాపారస్తులను గానీ, మధ్యవర్తులను గానీ నమ్మి అప్పు ఇవ్వరాదని సూచించారు. జీవాలను విక్రయించేటప్పుడు పూర్తి నగదు తీసుకోవాలని తెలియజేశారు. లేనిచో డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తారని వారు తెలిపారు.

న్యాయం చేయాలంటూ బాధితుల రిలే దీక్షలు

రాయచోటి అర్బన్ : దళితుల భూమిని ఆక్రమించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. తమ భూమిని ఆక్రమించిన రహంతుల్లా అతని కుటుంబసభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి తమ భూమిని తమకు తిరిగి ఇప్పించాలని గుర్రంకొండకు చెందిన బుడ్డపల్లె కదిరప్ప కుటుంబీకులు గురువారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ విషయమై గతంలో అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో రిలే నిరహార దీక్షలకు చేస్తున్నట్టు బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

అప్రకటిత కరెంట్ కోతలతో ఇక్కట్లు

గాలివీడు : పట్టణంలో అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. ఒక పక్క ఎండలు మండిపోతుండగా అనధికారికంగా కరెంట్ సరఫరాను గంటల తరబడి తీసేస్తుండటంతో ఫ్యాన్లు తిరగక, గాలి రాక వృద్ధులు, చిన్నారులు నరకం చూస్తున్నారు. ఇన్వర్టర్లు(బ్యాటరీ) లేని వ్యాపార దుకాణాలు, ఇళ్లలో ఉండేవారు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై విద్యుత్ సిబ్బందిని ఆరాతీస్తే కోతలు లేవని గోపనపల్లె, గోరాన్‌చెరువు సబ్ స్టేషన్లలో లోడ్ ఎక్కువై సిటీలు దెబ్బతినడం వలన గత రెండు రోజులుగా అంతరాయం కలిగిందని పేర్కొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న వత్తలూరు

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జబ్బిరెడ్డి మధుసూదన్‌రెడ్డి (56) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు ముక్కా వరలక్ష్మి, ముక్కా మధుసూదన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు టంగుటూరి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

సంబేపల్లె : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ వారి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డీఆర్‌పీ వలీ, ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధుల పట్ల అవగాహన ఉండటం వలన హెచ్‌ఐవీకి గురికాకుండా చూసుకోవచ్చునన్నారు. చికిత్స కన్నా నివారణ మంచిదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఆదర్శ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యవేక్షణ కొరవడి.. అభివృద్ధిలో వెనుకబడి

- కళావిహీనంగా ఎర్రచందనం పార్కు
- ఒకప్పుడు నిత్యం సందర్శకులతో కళకళ
- నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పర్యాటకులు లేక విలవిల

కోడూరు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు 2006లో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎర్రచంద్రనం పార్కును నిర్మించింది. దాదాపు 30 ఎకరాలలో తీసుకొచ్చిన ఎర్రచందనం పార్కులో అన్ని హంగులు ఏర్పాటు చేశారు. ఎప్పుడూ చిన్నారులు, పెద్దలు, అన్ని వయసుల వారితో నిత్యం పార్కులో సందడి వాతావరణం కనిపించేది. సందర్శకుల కోసం పార్కులో స్విమ్మింగ్‌పూల్, మండపం, క్రోటన్ మొక్కలు, కట్టడాలు, కుటీరాలు, పందిర్లు, అడవి అందాలను ఆస్వాదించే విధంగా అక్కడక్కడా అరుగులు, పక్షుల గూడ్లు మొదలగువాటిని అన్ని రకాలుగా తీర్చిదిద్దారు. పార్కు ఏర్పాటు నుంచి ఈ పార్కులో అన్ని హంగులను తీసుకురావడంలో అప్పటి రేంజర్ రామ్లానాయక్ ఎంతో కృషి చేశారు. ఆయన బదిలీ అనంతరం ఈ పార్కును ఏ అధికారి పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో పార్కు అభివృద్ధి పనులు జరగక పార్కులోని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కోడూరు వాసులు ప్రకృతి ఒడిలో కాసేపైనా సేదతీరేందుకు ఉన్న ఏకైక పార్కు దౌర్భాగ్య స్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, అటవీ అధికారులు ఎర్రచందనం పార్కును అభివృద్ధి చేయాలని కోడూరు ప్రజలు కోరుతున్నారు.

– రైల్వేకోడూరు అర్బన్


అప్పట్లో క్రోటన్ మొక్కలతో అందంగా ఉన్న పెంకుల కుటీరం


చెట్లు అన్ని ఎండిపోయి శిథిలావస్థకు చేరుకున్న నేటి పరిస్థితి



నాడు అందంగా ఉన్న పక్షుల కుటీరం వద్ద పిల్లల కోలాహలం


నేడు మైల పడ్డ కుటీరం


నీటిలో బోటింగ్ చేస్తున్న చిన్నారులు (ఫైల్)


స్విమ్మింగ్‌పూల్ ఇప్పటి దుస్థితి

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం


పుల్లంపేట: డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

పుల్లంపేట : స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో గురువారం పుల్లంపేట ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు గురించి అవగాహన కల్పించారు. హెల్పింగ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలే చిన్నాభిన్నమవుతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలు గురించి అవగాహన కల్పించారు. కావున యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మి, సురేష్ కుమార్, ప్రేమ్ కుమార్, ప్రిన్సిపల్ లీలా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : ప్రాణాంతకరమైన మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి లక్ష్యాల వైపు పయనించాలని కడప ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఐఎంహెచ్ డాక్టర్ సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత్తు మందుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు వెంకటరమణ, జె.విజయకుమార్, ఎస్.లక్ష్మిదేవి, ప్రేమకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి


సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులను వెంటనే ఆపాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతో అకారణంగా తొలగించి అంగన్‌వాడీ వర్కర్ యస్.ఆర్.జానకిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు రాయచోటి సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమి నేతలు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి నేడు అకారణంగా కార్మికులను తొలగిస్తుండడం దారుణమన్నారు. జానకిని విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామంటూ ఆయన అధికారులను హెచ్చరించారు. అనంతరం సీడీపీఓకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, నాయకుడు మాధవయ్య, యూనియన్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, నాయకురాళ్లు ఖాజాబీ, విజయమ్మ, అరుణ, సుమలత, రమణమ్మ, రెడ్డెమ్మ, ఉమా, శైలజ, జలజ, అంజలి, పద్మజ, జయమ్మ, శంకరమ్మతోపాటు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలపై నిరసన

రాయచోటి (జగదాంబసెంటర్) : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై గురువారం రాయచోటిలో కాంగ్రెస్ నేతలు నిరసన ప్రదర్శన చేశారు. మొదటగా కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీబొమ్మకు పూలమాల వేసిన అనంతరం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు అమీర్‌బాషా, కె.శాంతయ్య, గోశాలదేవి మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై బీజేపీ మిత్రపక్షమైన శివసేన పార్టీ షిండే వర్గానికి చెందిన నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వ్యాఖ్యలు చేసిన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీపీఐ జిల్లానేత విశ్వనాథనాయక్ సంఘీభావం ప్రకటించారు. అనంతరం జిల్లా ఎస్పీని కలుసుకుని ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నేతలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఆదుకున్న సోమశిల వెనుకజలాలు

పెనగలూరు : వినాయక ఉత్సవాలలో భాగంగా నిమజ్జనానికి సోమశిల బ్యాక్ వాటర్ ఆదుకుంది. పెనగలూరు మండలంలో ఒక చెరువులోనూ చుక్క నీరు లేకపోవడంతో నిమజ్జనానికి ప్రజలు బాగా ఇబ్బందులు పడ్డారు. సోమశిల బ్యాక్ వాటర్ బాగా ఆదుకుందని మండలంలోని గ్రామాల ప్రజలు అనుకుంటున్నారు. ఎస్‌ఆర్ పురం గ్రామం వద్ద సోమశిల బ్యాక్ వాటర్ ఉండటంతో పోలీసులు అక్కడే నిమజ్జన కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు. మండలానికి చివరిలో ఉన్న ఎస్‌ఆర్ పురం వద్దకు నలుమూలల నుంచి దాదాపు 30 కిలోమీటర్లు దూరం నుంచి విగ్రహాలు తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. కాగా సోమశిల వెనుకజలాలు లేకుంటే రాజంపేట మండలంలోని అత్తిరాల లేదంటే చిట్వేలి మండలంలోని చెరువులలో నిమజ్జనానికి విగ్రహాలను తరలించాల్సి వచ్చేది.

బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లె : బ్యాంకుల నుండి అందించే ఆర్థిక పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ జిల్లా మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. గురువారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీలో గ్రామ సమైక్య సభ్యులకు షికారిపాలెం గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బ్యాంకులు ద్వారా అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు పొందాలన్నారు. అందులో భాగంగా ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం, జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి, స్వల్ప వడ్డీ రుణాలు వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో వడ్డీతో సహా చెల్లించి తిరిగి రుణాలు పొందాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్ వలీ, కో–ఆర్డినేటర్ చంద్ర, సీసీలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న లాయర్లు

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రస్తుత సమాజంలోని ప్రజలు బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని లాయర్లు వై.మోహన్‌రెడ్డి, రామాంజనేయులు కోరారు. రాయచోటి పట్టణం పీసీఎస్ఎస్ – టీఐ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ సూచనల మేరకు జిల్లా వైద్య శాఖ సహకారంతో క్రైసిస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు ఉంటే వివాహానికి అర్హులన్నారు. అమైతిక బాలికల ట్రాఫింగ్ యాక్ట్ గురించి ప్రజలకు తెలియజేశారు. అమ్మాయిల అక్రమ రవాణా గురించి తెలియజేశారు. అక్రమ రవాణా అయినటువంటి అమ్మాయిలని బలవంతంగా వ్యభిచారంలో దించుతున్నారన్నారు. మేజర్ అయిన స్త్రీలు, పురుషులు కలిసి జీవించడం చట్టరీత్యా నేరం కాదని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్న చూపు చూడటం తగదన్నారు. వ్యభిచార గృహాలపై పోలీసుల దాడులు చట్టాలు ప్రజలకు వివరించారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ స్వాతి మాట్లాడుతూ తమ సంస్థ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడం వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు నివారణ మార్గాలు తీసుకోవాల్సిన ఆహారం, పోషక విలువలు తెలియజేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పీర్ ఎడ్యుకేటర్స్, ఓఆర్‌డబ్ల్యూలు, ట్రాన్స్‌జెండర్స్, హెచ్‌ఆర్‌జీలు పాల్గొన్నారు.

వర్షాల కోసం దండు మారెమ్మకు జలాభిషేకం


దండు మారెమ్మకు జలాభిషేకం చేస్తున్న రైతులు

సుండుపల్లె : వర్షాలు కురిపించి రైతులను ఆదుకోవాలంటూ గంగిరెడ్డిగారిపల్లెలో వెలసిన దండు మారెమ్మకు గ్రామస్తులు గురువారం జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు విరివిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉన్నారని, అయితే కొన్ని నెలలుగా వర్షాలు కురవకపోవడంతో వర్షాధారిత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఆకేపాటి నివాళి


నందలూరు: జయరాంరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి


రాజంపేట రూరల్: శివప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని కాపు వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాడి జయరాంరెడ్డి (85) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి నివాళులర్పించి, మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట రాజంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంపా సుధాకర్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, గుండు మల్లికార్జున రెడ్డి, గుండు గోపాల్‌రెడ్డి, అరిగె హరిబాబు, గాడి వెంకటసుబ్బారెడ్డి, మధురాజు, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, జనార్దన్ రెడ్డి, ఎముక దుర్గయ్య, అది, మోడపోతుల సుధ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాజంపేట రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న కార్యకర్తల మనోబలమే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్షగా నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇటీవల ఏబీ శివప్రసాద్‌రెడ్డి సతీమణి డాక్టర్ నీరద స్వర్గస్తురాలైనారు. దీంతో పట్టణంలోని ఆదిపరెడ్డి కాలనీలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఏబీ శివప్రసాద్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్యే ఆకేపాటి పరామర్శించారు. ఎమ్మెల్యే ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వైవీయూ : నగరంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 4వ జాతీయ ఫార్మా విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ఆసుపత్రుల సహకారంతో హెల్త్‌క్యాంపు నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు.

ఆదర్శ పాఠశాలకు బస్సు నడపండి

పెనగలూరు : మండలంలో ఉన్న మోడల్ స్కూల్‌కు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయాలని పలువురు మండల కేంద్రం వాసులు రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్యకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన డిపో మేనేజర్ ఆర్టీసీ సిబ్బందిని గురువారం మోడల్ స్కూల్‌కు పంపించారు. మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు ఏయే గ్రామం నుంచి అధికంగా వస్తున్నారన్న అంశంపై ఆరాతీశారు. కార్యక్రమంలో ధనయ్య, శివ, షామీర్ బాషా, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జంక్ ఫుడ్ ఇవ్వరాదు


సిద్దవటం: మాట్లాడుతున్న ఏసీడీపీఓ శోభారాణి


రామాపురం: గోపగుడిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో..

సిద్దవటం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఐసీడీఎస్ అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి తెలిపారు. మండలంలోని జంగాలపల్లె గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. బాలామృతంతో పిండి వంటలు తయారు చేసి పిల్లలకు ఎలా తినిపించాలో తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే పోషక ఆహారం క్రమం తప్పకుండా భుజించాలన్నారు. ముఖ్యంగా 5 సంవత్సరాలలోపు చిన్నారులకు జంక్ ఫుడ్ పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాపురం : మహిళలు, గర్భిణులు, పిల్లలు, బాలింతలు, రక్తహీనత బారిన పడకుండా మంచి పోషకాహారం తీసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు అధికారి పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని గువ్వలచెరువు సెక్టార్‌లోని గోపగుడిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో గువ్వలచెరువు సెక్టార్ సూపర్‌వైజర్ హుసేనమ్మ, పద్మజరాణి, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

- కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా
- పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడతామని ప్రతిజ్ఞ


చిన్నమండెం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ దివ్య


వీరబల్లె: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు


పెనగలూరు: బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో సెక్రటరీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీలోని చెత్తను తొలగించి మురికినీరు ఉన్నచోట బ్లీచింగ్ చల్లించారు. అలాగే రోడ్ల వెంబడి ఉన్న చెత్తాచెదారం తొలగించి ట్రాక్టర్ ద్వారా బయట ప్రాంతాలకు తరలించారు. ప్రతిరోజూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలియజేశారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ, ఎంఈఓ, ఉపాధి హామీ, ఎగువపేట ఎంపీపీ పాఠశాలల్లో గురువారం అధికారులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించామని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండటమే గాకుండా, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విలియంరాజు, ఏపీఓ నరసింహులు, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేట : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ పెంచలయ్య మాట్లాడుతూ గ్రామాలలోని ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, పంచాయతీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ర్యాలీని కళాశాల నుంచి ఎంఆర్ఓ కార్యాలయం మీదుగా వై జంక్షన్‌లో మానవహారాన్ని నిర్వహించి స్వచ్ఛతాహీ సేవా ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఈఓపీఆర్‌డీ పట్నాయక్, సెక్రటరీ ఎం.సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వెంకట కృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వీరబల్లె : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి బస్టాండ్ మీదుగా ఎంపీడీఓ కార్యాలయం వరకు సాగింది. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు.

గాలివీడు : స్వచ్ఛ గ్రామాల నిర్వహణే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీడీఓ శ్రీనువాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతో స్వచ్ఛ గ్రామాలు రూపుదిద్దుకుంటాయని చెప్పిన మహాత్ముడి మాటలే స్ఫూర్తిగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ రామాంజులు మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ స్వాతంత్ర్యంతోపాటు అభివృద్ధి, స్వచ్ఛమైన దేశం కోసం ఆకాంక్షించారు. గాంధీ ఆశయ సాధనలో మనవంతుగా మన ఇంటిని మన పరిసరాలు, మన వీధిని, మన గ్రామాన్ని, మన మండలాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం కోసం ప్రతిజ్ఞ చేశారు.

చిన్నమండెం : మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రతిజ్ఞ నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఈ నెల 14వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదే విధంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పథకం –1, 2 విభాగాల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత శుభ్రతా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వెంకటసుబ్బయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు నాగనవీన్, సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.